క్లుప్తంగా

నీటి నాణ్యతపై శిక్షణ

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం తాగునీటి సరఫరా సహాయకులకు నీటి నాణ్యతపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ రఘు మాట్లాడుతూ.. గ్రామాల్లో శుద్ధిజలాలను సరఫరా చేస్తూ.. తాగు నీటి ఎద్దడి రాకుండా చూడాలని చెప్పారు. అనంతరం నీటి నాణ్యత పర్యవేక్షణ గురించి అవగాహన కల్పించారు. ఎంపీఓ రఘు, ఏఈ ప్రణీత్, కేతన్, శిక్షకులు రఘుమారెడ్డి, స్నేహలత, కవిత, నీటి సహాయకులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారానికి ఆహ్వానం



ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఆమనగల్లు: గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ఆహ్వానించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

నిర్మాణ రంగంలో వృత్తి నైపుణ్యం అవసరం

కడ్తాల్: భవన నిర్మాణ రంగంలో వృత్తి నైపుణ్యత అవసరమని కార్మిక నాయకులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్ అన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్), తెలంగాణ భవన నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధి వంపుగూడలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికులు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ద్వారా అందే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకుడు అశోక్ తదితరులు ఉన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా శివశంకర్



ఆమనగల్లు: సీపీఎం ఆమనగల్లు మండల కార్యదర్శిగా శివశంకర్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన పార్టీ ఏరియా మహాసభలో.. నాయకులు కానుగుల వెంకటయ్య, గుమ్మడి నర్సయ్యల ఆధ్వర్యంలో శివశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా గజ్జె మల్లేశ్, నర్సింహ, యాదయ్య, హంసమ్మ, యూనుస్, అమ్మన్న, రమేశ్‌లను నియమించారు. అనంతరం శివశంకర్‌ను పార్టీ శ్రేణులు అభినందించారు.

నేడు లయన్స్‌క్లబ్ రీజియన్ సమీక్ష

ఆమనగల్లు: కల్వకుర్తి పట్టణం లయన్స్ భవన్‌లో శనివారం లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్ఓ పాషాలు ఒక ప్రకటనలో తెలిపారు. లయన్ రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించే సమీక్షలో రీజియన్ పరిధిలో చేపట్టే సేవా కార్యక్రమాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి రీజియన్ పరిధి లయన్స్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డుకు క్యూరింగ్



సాక్షి ఎఫెక్ట్..

తుర్కయంజాల్: 'కొరవడిన నిఘా'.. శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించారు. నిర్మించిన సీసీరోడ్డుకు వెంటనే క్యూరింగ్ చేయాలని నిర్మాణ దారుడికి ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు కాంట్రాక్టర్.. నీటితో క్యూరింగ్ పనులు మొదలు పెట్టారు. దీంతో ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

7న తైబజార్ వేలం

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఈ నెల 7వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెంకాయలు–పూజా సామగ్రి తదితర సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ముందుగా డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు.



ఆమనగల్లు: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తజనం



ఆమనగల్లు: మహిళల సామూహిక కుంకుమార్చన

ఉత్సాహంగా.. ఉత్సవాలు

- రెండోరోజు ధనలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ
- ప్రత్యేక పూజలందుకున్న అమ్మవారు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆమనగల్లు: శరన్నవరాత్రోత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, భక్త మార్కండేయస్వామి ఆలయాల్లో ధనలక్ష్మీదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తజనం పూజలు, హోమం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్, కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, నాయకులు అప్పం శ్రీను, శివలింగం, సత్యరాములు, మధుసూదన్, వాసు, అప్పి, రమేశ్, మామిడిశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అమ్మవారికి ఓడిబియ్యం పోశారు. ఇందులో కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, మాజీ ఎంపీపీ తల్లోజు లలిత, వెంకటయ్య పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరి దేవిగా..



ఇబ్రహీంపట్నం: బాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో దుర్గామాత

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ, శివరామాలయాల్లో కొలువైన అన్నపూర్ణేశ్వరి దేవీ సన్నిధిలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజున అమ్మవారు.. బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య.. కలశ పూజ, విశేష పూజలు, యజ్ఞం, చండీ హోమం, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలి, నిర్వాహకులు భాస్కర్ నాయక్ ఆలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

దుర్గామాతకు..

దుర్గామాత మిత్రమండలి ఆధ్వర్యంలో పాలశీతలీకరణ కేంద్రంలో కొలువైన దుర్గమ్మకు భక్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో మాజీ సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, శేఖర్‌నేత, అశోక్, మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, అనిల్‌గౌడ్ మహేశ్‌గౌడ్ సాయిప్రభు, శివ తదితరులు ఉన్నారు.



ఆమనగల్లు: అమ్మవారి సన్నిధిలో..



కడ్తాల్: మైసిగండిలో పూజలు



కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంలో..

'జమిలి' పేరుతో మత రాజ్యాంగం!

- కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలి
- సీపీఎం నాయకుడు వెంకటయ్య

ఆమనగల్లు: జమిలి ఎన్నికల పేరుతో ఫెడరల్ వ్యవస్థను రద్దుచేసి, మత రాజ్యాంగం తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీపీఎం నాయకుడు కానుగుల వెంకటయ్య ఆరోపించారు. కుట్రలను తిప్పికొంట్టేందుకు ప్రజలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకేదేశం, ఒకే ఎన్నిక, ఒకే భాష అనే విధంగా బీజేపీ దేశంలో తనకు నచ్చిన రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. దేశంలో అనేక మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు ఉన్నాయని, వివిధ సంస్కృతులు ఉన్న ఏకత్వంలో భిన్నత్వంగా ఉన్న దేశాన్ని, ఒక మతదేశంగా మార్చాలని మోదీ కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఎం ఎప్పటికప్పుడు తిప్పికొడుతుందని, వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు గుమ్మడి కుర్మయ్య, మండల కార్యదర్శి శివశంకర్, నాయకులు పట్నం నర్సింహ, యాదయ్య, గజ్జె మల్లేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: పట్నం ఎంబీఆర్ 11 ఫీడర్ పరిధి లైన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 2 వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. రిలయన్స్ ట్రెండ్స్, ఎంబీఆర్ కాలనీ గృహాలతో పాటు.. 11 కేవీ గురునానక్ ఫీడర్ మరమ్మతుల కారణంగా పరిధి ప్రాంతాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వెల్లడించారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

- సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కిషన్
- సీతారాం ఏచూరికి నేతల నివాళి



సీతారాం ఏచూరికి నివాళి అర్పిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కన్వీనర్ డి.కిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధి రాగన్నగూడ రాజీవ్ గృహకల్పలో ఏర్పాటు చేసిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. మూడేళ్లకు ఒకసారి మహాసభలను నిర్వహిస్తుంటామని చెప్పారు. ఈ కాలంలో చేసిన ప్రజా ఉద్యమాలు, ఇతర కార్యక్రమాలను సమీక్షించుంటామని తెలిపారు. రాబోయే మూడేళ్ల కార్యచరణ కూడా రూపొందించామని పేర్కొన్నారు. అనంతరం దివంగత నేత, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ప్రకాష్ కారత్, వెంకటకృష్ణ, మాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో పార్టీ రాజీవ్ గృహకల్ప నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శిగా పల్లె కృష్ణ, సభ్యులుగా నాగయ్య, వెంకటేశ్, శ్రీను నాయక్, శివ ప్రసాద్, భాస్కర్, సుధాకర్, నరహరి, సైదులు, నరసింహ, కాశీం, నవీన్ నియమించారు.

మాజీ మంత్రి ఇంద్రారెడ్డికి నివాళి

మంచాల: మాజీ మంత్రి ఇంద్రారెడ్డి సేవలు మరువ లేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి అన్నారు. ఇంద్రారెడ్డి జయంతిని పురస్కించుకుని మండల పరిధి ఆరుట్ల గ్రామంలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇంద్రారెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేశారని, ప్రత్యేక తెలంగాణ కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్, పార్టీ నాయకులు ముచ్చర్ల వెంకటేశ్ యాదవ్, జంగయ్య, బాషయ్య, రమేష్, రాజు, చంద్రయ్య, సురేష్, ఎల్లేష్, శివ, శ్రీను, జగన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఠానునాయక్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో గిరిజన సంఘాల నాయకులు

మీర్‌పేట: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు ఠానునాయక్ విగ్రహ ఏర్పాటుకు చందన చెరువు కట్టపై గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఠానునాయక్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. మూడు వేల గ్రామాలకు విముక్తి కల్పించారని గుర్తు చేశారు. కార్పొరేటర్లు ఇంద్రావత్ రవి నాయక్, అనిల్‌యాదవ్, దీప్‌లాల్‌చౌహాన్, నీలా రవినాయక్, దశయనాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి జీవాలు మృతి

మంచాల: పిడుగు పడి ఏడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మండల పరిధి బండలేమూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లం దశరథ.. మేతకోసం తీసుకెళ్లిన తన జీవాలను.. తిరిగి తోలుకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు సమీపాన పిడుగు పడింది. ఈ ఘటనలో ఏడు గొర్రెలు మృత్యువాత పడగా.. కాపరికి స్వల్ప గాయాలు అయ్యాయి. చనిపోయిన జీవాల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, కాపరి దశరథను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు మల్లేశ్ కోరారు.



గొర్రెల కళేబరాలు

నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి గౌరెల్లి స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల బోర్డు సభ్యులను నియమిస్తూ దేవాదాయ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా నెల్లూరి రాజు, వైస్ చైర్మన్‌గా చెంచల శ్రీనివాస్, సభ్యులుగా గ్యార దివ్య, నీరుడు రాజు, చెట్టిగారి రాజేశ్‌లను నియమించారు. ఆలయ వంశ పారంపర్య అర్చకుడు గోవర్ధనం నవీన్ కుమార్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా కొనసాగనున్నారని ఉత్తర్వులో పేర్కొంది. నూతన సభ్యులు శనివారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

'అవంతి'లో ఫ్రెషర్స్ డే



లింబాద్రిని సత్కరిస్తున్న కళాశాల ఫౌండర్ శ్రీనివాస్‌రావు

అబ్దుల్లాపూర్‌మెట్: నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ మండల పరిధి గుంతపల్లి గ్రామంలోని అవంతి ఇంజినీరింగ్ కళాశాలల ఆవరణలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల ఫౌండర్, మాజీ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రముఖులు త్రిపురాంబ, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రెసిడెంట్ జ్ఞానేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ ఎంవీఎస్ఎస్ నందీష్, ప్రధాన కార్యదర్శి ప్రియాంక, ఎండీ శ్రావణ్‌కుమార్, డైరక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్స్ రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమయ్య మృతి తీరని లోటు

కడ్తాల్: ధ్యాన ప్రచారకుడు, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ సభ్యుడు, మాస్టర్ ప్రేమయ్య మృతి ధ్యాన జనులకు తీరని లోటని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. గుండె పోటుతో ప్రేమయ్య శుక్రవారం మృతి చెందగా.. కొత్తకోటలోని ఆయన స్వగృహంలో ప్రేమయ్య పార్థివదేహానికి దశరథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమయ్య సేవలను స్మరించుకున్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, సింగిల్‌విండో డైరక్టర్ సేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి
- రూ.35 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపల్ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పుర పరిధి 2,4,6,11 వార్డుల్లో రూ.35 లక్షలతో సీసీరోడ్లు, వాటర్ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ అంటనే అభివృద్ధిలో ఆదర్శమని, ఇప్పటికే కోట్లాది రూపాయలు వెచ్చించి తాగునీరు, సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కుంట్ల మౌనిక, కొప్పు కృష్ణంరాజు, డీఈ వెంకన్న, ఏఈ వీరాంజనేయులు, మాజీ ఎంపీటీసీ కొప్పు జంగయ్య, రాములు, వసంత, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

దురలవాట్లకు దూరంగా ఉండండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, దురలవాట్లకు బానిసై జీవితాలను ఆగం చేసుకోవద్దని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డి.శ్రీనివాస్‌లు అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్, షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గంజా, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలకు అలవాటు పడినా, అమ్మాయిలను వేధింపులకు గురిచేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా ప్రభావానికి గురికావొద్దన్నారు. చదువు, సంస్కారం ఉంటే ఏరంగంలోనైనా రాణిస్తారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి
- సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని సింగిల్‌విండో డైరెక్టర్, విజయ డెయిరీ సొసైటీ కడ్తాల్ అధ్యక్షుడు చేగూరి వెంకటేశ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. పుట్టిన రోజు, వివాహ వార్షికోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు.. వాటిని కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు యాదయ్యగౌడ్, భిక్షపతి, యాదగిరిరెడ్డి, లక్పతినాయక్, రాంచందర్, మల్లేశ్‌గౌడ్, సత్యంయాదవ్, రాజేశ్, వడ్డెరాజు, రవి, షాబుద్దీన్, మహేశ్, శ్రీకాంత్, ప్రవీణ్, యాదయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కాంగ్రెస్ నాయకులు

జీపీ సిబ్బందికి దుస్తుల పంపిణీ



యాచారం: దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

యాచారం: దసరా పండుగను పురస్కరించుకుని కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ముదిరాజ్.. మాల్ జీపీలో పనిచేస్తున్న 33 మంది సిబ్బందికి శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తుంటారని పేర్కొన్నారు. వారికి తనవంతు కానుకగా దుస్తులు అందజేయడం సంతోషంగా ఉందని చెప్పారు.



మంచాలలో..

నోములలో..

మంచాల: గ్రామ పంచాయతీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దండేటికార్ రవి అన్నారు. దసరా పండుగ సందర్భంగా జీపీ సిబ్బందికి కానుకగా.. దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జయానందం, మాజీ సర్పంచ్ ముత్తమయ్య, మాజీ ఉప సర్పంచ్ చక్రపాణి, వార్డు మాజీ సభ్యుడు వీరేష్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు

మీర్‌పేట: అభివృద్ధి పనుల పేరిట బాగున్న రోడ్డును తవ్వారు. అనంతరం మట్టితో పూడ్చి వదిలేశారు. దీంతో ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మీర్‌పేట జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్‌లో గతంలో డ్రైనేజీ పైపులైన్ పనుల నిమిత్తం రహదారిని తవ్వి, పనులు పూర్తయ్యాక సంబంధిత కాంట్రాక్టర్ ఎలాంటి మరమ్మతులు చేపట్టకుండా.. వదిలేశారని స్థానికులు ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలనే మంచిగా ఉన్న రోడ్డు కాస్త.. అధ్వానంగా మారిందని పేర్కొంటున్నారు. తద్వారా ఇబ్బంది పడుతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.



అంబేద్కర్‌నగర్ రోడ్డు దుస్థితి